# బంగారు గాజులు

-ఎ.ఎం.బాల

"ఊరు రమ్మంటున్నా కాడి రమ్మంటున్నా ఇంకా ఆ గాజుల మీద వ్యామోహం మాత్రం పోలేదు మీ అమ్మగారికి" కోపంగా అంది మోహిని.

"ఏం నీకివ్వనందా గాజులు? తనుమాత్రం ఏం చేసుకుంటుందట ముసలిది అయిపోయిందిగా" భార్య మాటలకి తాళం వేస్తున్నట్లుగా అన్నాడు శివశంకర్.

"తలలు బోడులైనా తలపులు బోడులౌతాయా అన్నట్టు రోజుకెన్ని సార్లు మురిసిపోతుందో ఆ గాజులు చూసుకుని" హేళనగా అంది మోహిని.

"పోనీలేవే అమ్మ మహా బతికితే ఒకటి, రెండేళ్ళు. ఆ తర్వాత ఆ గాజులెలాగూ నీకే చెందుతాయి. ఆవిడకున్నది మాత్రం మనం తప్ప ఇంకెవరు" బిడ్డ పుట్టే డేట్ లెక్కవేసి డాక్టర్ డెలివరీ డేట్ ఇచ్చినట్టు తల్లి ఆయుర్దాయాన్ని లెక్కవేసి చెబుతున్నాడు శివశంకర్.

"అంతేలెండి. ఆవిడపోయేవరకూ నాకా గాజులు దక్కేటట్టు లేవు. అంతవరకూ ఆవిడకి చేసే ఈ అరవచాకిరీ నాకు తప్పేట్టు లేదు" నిట్టూర్చింది మోహిని.

నీరసంగా పడుకున్న పద్మావతమ్మకి పక్క గదిలోంచి కొడుకూ, కోడలూ మాట్లాడుకునే మాటలు లీలగా వినిపిస్తున్నాయి.

ప్రాణంలేని గాజులు దక్కించుకోవడం కోసం వాళ్ళు తన ప్రాణం పోవాలని కోరుకుంటున్నారా? కోడలన్నట్టు నిజంగా బంగారం మీద వ్యామోహంతోటే తను ఆ గాజులు వాళ్ళకివ్వనంటోందా? లేదు...లేదు.. తనకి ఆ గాజులు భర్త మిగిల్చిన జ్ఞాపకం.

తన భర్త స్వహస్తాలతో తొడిగిన ఆ గాజులు చేతిమీద కదిలినపుడల్లా భర్త చేతి స్పర్శ తగిలినట్టే ఉంటుంది తనకి. ఆ జ్ఞాపకాలు గుర్తుచేసే ఈ గాజులు తన ప్రాణం పోయేంతవరకూ తనతోటే ఉండాలి.

పద్మావతమ్మ మనసు గత జ్ఞాపకాల్లోకి జారుకుంది.

★ ★ ★

"ఏయ్ పద్మూ! ఇలారా" వంటగది గుమ్మం దగ్గర నుంచొని తనకి మాత్రమే వినబడేలా పిలిచాడు భర్త విశ్వనాథం.

అత్తగారికి వంటపనిలో సాయం చేస్తున్న పద్మావతి ఇప్పుడు కాదన్నట్టు కళ్లతోనే సైగ చేసింది.

మరికాసేపటికి "వదినా అన్నయ్యకి తలనొప్పిగా ఉందట. నిన్ను ఓ కప్పు స్ట్రాంగ్ కాఫీ కలిపి తెమ్మన్నాడు" గుమ్మంలోంచే పెద్దగా అర్థరేసి వెళ్లిపోయింది ఆడపడుచు.

అది ఉత్తుత్తి తలనొప్పనీ, తనని ఏదోరకంగా గదిలోకి రప్పించుకోవడానికి భర్త ఆడే నాటకమనీ తెలుసు పద్మావతికి.

అత్తగారు, ఆడపడుచూ, మరుదులూ అందరూ మసలే ఇంట్లో తనని అలా భర్త మాటిమాటికీ పిలిపించుకోవడం పద్మావతికి ఇష్టం ఉండదు. అలాగని భర్తంటే అయిష్టత కాదు. ఇంట్లో అందరూ ఏమనుకుంటారో అన్న భయం. తను ఎంత చెప్పినా భర్త తనని అర్థం చేసుకోడు. తన భయాలన్నీ తేలికగా కొట్టిపారేస్తాడు. పద్మావతికి భర్త మీద బోలెడు కోపం వచ్చింది.


"ఆ కాఫీ పనేదో త్వరగా చూడు తల్లీ. ఇచ్చేసి త్వరగా వచ్చెయ్యి. ఈ పనంతా నేనొక్కర్తినే చేయలేను" అన్న అత్తగారి మాటల్లో వెక్కిరింతో, హేళనో, పద్మావతికి ఏదో తప్పు చేస్తున్న ఫీలింగ్ని కలిగించాయి.

ఇక తప్పదన్నట్టు కాఫీ కలిపి పట్టుకెళ్లింది. కాఫీ కప్పుతో గదిలోకొచ్చిన భార్యను చూడగానే విశ్వనాథం కళ్ళు మెరిశాయి.

కాఫీ తీసుకోకుండా పద్మావతి చేయి అందుకున్నాడు.

"కాఫీ తీసుకుని నన్నొదిలేయండి. నాకు అవతల చాలా పనుంది" భర్త చేయి విడిపించుకుంటూ అన్నది పద్మావతి.

"కాఫీ ఎవడికి కావాలోయ్" భార్య చేతిని



మరింత గట్టిగా పట్టుకుని అన్నాడు విశ్వనాథం.

"మరెందుకు కాఫీ వంకతో పిలిచారు? నేనేం ఖాళీగా కూర్చోలేదు మీరు పిలిచినప్పుడల్లా రావడానికి" విసురుగా అన్నది పద్మావతి.


"ఎందుకు పిలిచానో చెబుతా దగ్గరగా రా మరి" భార్య కోపాన్ని ఏమాత్రం లెక్కచేయకుండా దగ్గరగా లాక్కున్నాడు విశ్వనాథం.

"మీరిలా మాటిమాటికీ పిలుస్తుంటే అందరూ ఏమనుకుంటారు? వాళ్లందరి ముందునుంచి ఇలా పట్టపగలు మీదగ్గరికి రావడానికి నేనెంత సిగ్గుతో చితికిపోతున్నానో మీరెందుకు అర్థం చేసుకోరు" కళ్ళనీళ్ళు తిరుగుతుండగా అన్నది పద్మావతి.

విశ్వనాథం గంభీరంగా మారిపోయాడు.

"చూడు పద్దూ... ఈమనుషులున్నారు చూశావూ మనం వారికి కన్వీనియెంట్‌గా ఉన్నంతకాలం మనని ఉపయోగించుకుంటూనే ఉంటారు. సొంత తల్లైనా, తోబుట్టువులైనా ఇందుకు మినహాయింపు కాదు. నాన్నగారు పోయేనాటికి నాకు పదిహేడేళ్ళు.


ఇంకా మేజర్ని కూడా కాని వయసు. ఎవరో ఒకరు సంపాదిస్తేగానీ గడవని పరిస్థితి. మోయలేని భారమైనా మోయక తప్పలేదు నాకు. రోజు మొత్తం పనిచేసినా బొటాబొటీగా ఖర్చులకి సరిపోయే జీతం కోసం చదువు మానేశాను.



# కంటి చూపును పెంచే మిరియాలు

మిరియాలని వంటకాలలో బాగా ఉపయోగిస్తారు. మిరియాలలో నలుపు, తెలుపు రెండు రకాలుగా వుంటాయి. నల్లమిరియాలు బాగా పండి తెల్ల మిరియాలు అవుతాయి. వీటిని సరైనవిధంగా ఉపయోగించి మంచి రసాయన గుణాలను పొంద వచ్చు. వంటకాలలో రుచిని కలిగించినట్టే రోగాల నుంచి విముక్తిని కలిగిస్తాయి. మిరియాలు అన్నిరకాల వైరస్‌లను తొలగిస్తాయని ఒక నమ్మకం వుంది. ఇది హృద్రోగ రోగాలను తగ్గిస్తుంది. కడుపులో మంటని పోగొడుతుంది. మిరియాలు తిన్నట్టయితే నోటిలో లార్ అనే శక్తి పెరిగి తిన్నది సరిగ్గా అరుగుతుంది. తెల్లమిరియాలు కంటి చూపును పెంచుతాయి. కంటి రోగాలకి తెల్ల మిరియాలు అంజనం లాగా పనిచేస్తాయి. చర్మం సౌందర్యవంతంగా వుంటుంది. అంతేకాదు, మూత్రాశయం, గర్భాశయం, జననేంద్రి యాలను ఉత్తేజపరుస్తాయి. నల్ల మిరియాలను సొంఠి చేసుకుని తాగితే లాభప్రదాంగా వుంటుంది. దగ్గ, వికారం, ఉబ్బసం వంటివి త్వరగా ఉపశమనం చెందుతాయి. సన్నని, లావుగల వారు రోజూ పాలల్లో కలుపుకుని సేవిస్తే మంచి ఫలితం వుంటుంది. శరీరం పుష్టిక రంగా తయారవుతుంది. మిరియాల్ని పాలలో కలుపుకుని తాగితే గొంతు సంబంధమైన ఇబ్బందులనించి ఉపశమనం కలుగుతుంది. అంతేకాదు జలుబు కూడా తగ్గుముఖం పడుతుంది.

-పావులూరి




అనకూడదు గానీ గొడ్డులా కష్టపడుతూనే ప్రైవేట్‌గా చదువుకున్నాను. ఇప్పుడూ కష్టపడి సంపాదిస్తూనే ఉన్నాను. ఇంటి పెద్దకోడలిగా నువ్వూ అత్తగారికి చేదోడువాదోడుగానే ఉన్నావు. అందరికోసం మనవంతు కర్తవ్యం మనం నెరవేరుస్తూనే ఉన్నాం. మరి మనకోసం కూడా మనం బతకాలి కదా. కొత్తగా పెళ్ళయిన వాళ్లం మన మధ్య ఎన్నో సరదాలూ ఉంటాయి. అవి తీర్చుకోవడంలో తప్పు లేదు. ఇందులో మా అమ్మకి, చెల్లెలకి, తమ్ముళ్లకీ మనం చేసే ద్రోహం ఏమీలేదు. ఇలా' నా దగ్గరకి వచ్చిన ప్రతిసారీ నువ్వేదో తప్పుచేస్తున్నట్టు క్రుంగిపోనక్కర్లేదు"

భర్త మాటల్లో నిజం గ్రహించిన పద్మావతి ఇంకెప్పుడూ భర్తకి ఎదురుచెప్పలేదు.

* * *

ఆరోజుకి సరిగ్గా పద్మావతి, విశ్వనాథంల పెళ్ళయి సంవత్సరం. పొద్దుటే తలంటుకుని పెళ్లినాటి పట్టుచీర కట్టుకుని పాయసం చేసింది పద్మావతి. వాలుజడలో తురిమిన కనకాంబరం పూల దండ అదేరంగు పట్టుచీరతో పెళ్ళినాటి పద్మావతిలా అనిపించింది విశ్వనాథానికి.

"ఏయ్ పద్మా. మన పెళ్ళిరోజు సందర్భంగా నీకోసం ఏం తెచ్చానో చెప్పుకో" అన్నాడు విశ్వనాథం.

"కొత్తచీర" వెంటనే అన్నది పద్మావతి.

తల అడ్డంగా ఊపాడు విశ్వనాథం.

"త్వరగా చెప్పాలి మరి" అన్నాడు విశ్వనాథం.

ఆలోచించింది పద్మావతి. తన భర్త తాహతుకి చీరని మించి విలువైన కానుకలు ఊహించలేదు తను.

"సరే నువ్వు ఓడిపోయానని ఒప్పుకుంటే నేనే చెప్పేస్తా"

"ఓడిపోయాను మహాప్రభూ తమరే చెప్పండి"

"ఐతే మరి కళ్ళు మూసుకుని చేతులు చాపు"

భర్త చెప్పినట్టే చేసింది పద్మావతి. కళ్ళు తెరుస్తూనే చేతులకి ఉన్న జత బంగారు గాజులని చూసి ఆశ్చర్యపోయింది పద్మావతి.

"ఎందుకండీ ఇప్పుడింత ఖరీదు పెట్టి" ఆశ్చర్యం నుంచి తేరుకుంటూ అన్నది.

"నీకు నచ్చాయా పద్మా.."

'మీరు తెచ్చిన వాయిల్ చీరైనా నాకు నచ్చుతుంది. కానీ ఇంట్లో ఇన్ని ఖర్చులుండగా ఇప్పుడింత ఖరీదు పెట్టి ఈ గాజులు కొనాల్సిన అవసరమేమిటండీ" మందలింపుగా అన్నది పద్మావతి.

ఏదో చెప్పబోయి విరమించుకున్నాడు విశ్వనాథం. పద్మావతి చేతికి బంగారుగాజులు చూసినప్పుడల్లా అత్తగారి మనసు కోపంతో భగ్గుమనేది. తన కొడుకుని కొంగున ముడేసుకుని నస పెట్టో, సాధించో పద్మావతే ఆ గాజులు కొనిపించుకుందని ఆవిడ నమ్మకం.

"ఎదిగిన చెల్లెలికి పెళ్ళిచేయాలి. తమ్ముళ్ళ చదువు సంధ్యలు పట్టించుకోవాలి. కాస్త కలిగినవాళ్ళయినా ఖర్చు దగ్గర వెనకా ముందూ చూస్తున్నారు. మనం మాత్రం లేనిపోని ఆడంబరాలకిపోయి డబ్బు దుబారా చేస్తున్నాం" పద్మావతి గాజులు చూసినప్పుడల్లా అనేది అత్తగారు. తల్లి మాటలు విశ్వనాథం చెవుల పడ్డా పట్టించుకోనట్టే ఊరుకునేవాడు. ఒకరోజు భర్త మంచి మూడ్‌లో ఉండగా అన్నది పద్మావతి-

"ఏమండీ మీ ప్రేమకి గుర్తుగా ఈగాజులు నా చేతికి ఉండేకన్నా ఏదైనా అవసరానికి ఇవి ఉపయోగపడితే బాగుంటుంది కదూ"

"అయితే ఏమంటావు ఇప్పుడు" అన్నాడు విశ్వనాథం.

"ఎలాగో మీ చెల్లికి పెళ్ళిచేయాలనుకుంటున్నారు కదా. ఒకవేళ ఏదైనా సంబంధం కుదిరితే ఈ గాజులు తనకి ఇచ్చేస్తాను. పెళ్ళికూతురికి ఓ జత గాజులు చేయించాలంటారుగా. కొత్తవి చేయించాలంటే మళ్ళీ ఎక్స్‌ట్రా ఖర్చు" అంటున్న పద్మావతి వంక బాధగా చూశాడు విశ్వనాథం. కాసేపు మౌనం వహించాక అపరాధిలా తలదించుకుని అన్నాడు విశ్వనాథం.

"పద్మా నన్ను అపార్థం చేసుకోనంటే ఓ నిజం చెప్పాలి నీకు. ఇందులో నిన్ను మోసం చేయాలన్న దురుద్దేశమేమీ లేదు నాకు. నా అసమర్థతని కప్పిపుచ్చుకునే ప్రయత్నం కూడా కాదు. కేవలం కొంతకాలమైనా ఓ అందమైన అబద్ధంతో నిన్ను సంతోషపెట్టాలనే తాపత్రయం తప్ప"

భర్తవంక అయోమయంగా చూసింది పద్మావతి.

"పద్మా ఆడవాళ్లకి నగలమీదా, చీరలమీద మోజు ఉండడం సహజం. నువ్వు కూడా అందుకు మినహాయింపేమీ కాదని నా నమ్మకం. అందుకే బంగారం గాజులు కొనే స్థోమత నాకెలాగూ లేదు కాబట్టి కేవలం బంగారం పూతపూసిన గాజులు మాత్రమే నేను నీకిచ్చాను. ఈసంగతి ముందరే చెబితే నువ్వేమనుకుంటావో అని భయమేసి ఊరుకున్నాను" పద్మావతి నిర్ఘాంతపోయింది.

భర్త తెచ్చిన కానుక విలువ గురించి ఆలోచించలేదు ఆమె. కేవలం తనను సంతోషపెట్టడం కోసం

భర్త చేసిన ప్రయత్నం, ఆ ప్రయత్నం వెనుక అతడికి తన మీదున్న ప్రేమా అర్థం చేసుకుంది.

"నిన్ను మోసం చేశాను కదూ. అబద్ధపు కానుకతో మన ప్రేమను చులకన చేశాను కదూ. నన్ను అసహ్యించుకుంటున్నావు కదూ..'' ఎదురుగా నిల్చుని దీనంగా అడుగుతున్న భర్తని చూస్తూంటే ఆమెలో ప్రేమావేశం ఉప్పొంగింది.

"ప్రేమ ఖరీదైన కానుకలతో పెరగదండీ. ఈ గాజులు బంగారం కన్నా విలువైనవి నాకు. మీ ప్రేమకి సాక్ష్యంగా ఈగాజులు నా జీవితాంతం నాతోనే ఉంటాయి. నన్ను నమ్మండి'' భర్త తలని ప్రేమగా హృదయానికి హత్తుకుంది పద్మావతి.

హాయిగా సాగిపోతున్న వాళ్ళ జీవితాలని దురదృష్టం యాక్సిడెంట్ రూపంలో వచ్చి విశ్వనాథాన్ని బలిగొంది. శోకదేవతే అయింది పద్మావతి.

కొడుకుపోయిన దుఃఖం ఒకవైపు, తీరని బాధ్యతలు మరొకవైపు క్రుంగదీస్తుంటే పద్మావతి గాజులు చూసినప్పుడల్లా అత్తగారి కోపం, బాధా రెట్టింపు అయ్యేవి.

"తల్లికి పట్టుచీర కొనడానికే సరిపోదు వాడి జీతం. నీకు బంగారుగాజులు కొన్నాడంటే ఎంతగా వేధించావో నా బిడ్డని..'' అని ఆడిపోసుకునేది.

మొదట్లో బాధపడ్డా అత్తగారి సాధింపులకి రాను రానూ అలవాటుపడిపోయింది పద్మావతి. భర్తపోయేనాటికి ఏడు నెలల గర్భవతి పద్మావతి. పుట్టింటివారు పురుటికని తీసికెళ్ళారు. శివశంకర్ పుట్టిన మూడోనెలలోనే ఆడపడుచుకి పెళ్ళి కుదిరందని ఉత్తరమొచ్చింది పద్మావతికి. అత్తగారు ఒక్కర్తి పని చేసుకోలేదని తల్లిదండ్రులు వారించినా చంటిబిడ్డని తీసుకుని వచ్చేసింది. కోడలిని బాగానే ఆదరించింది అత్తగారు.

ఓ రెండురోజులు పోయాక గానీ అసలు సంగతి అర్థంకాలేదు పద్మావతికి. మగపెళ్ళివారు అమ్మాయికి గొలుసూ, ఓ జతగాజులూ పెట్టమన్నారుట. గొలుసు నాది ఇస్తాలే, నీ గాజులిస్తే వాటికి మెరుగుపెట్టించి కూతురికి ఇచ్చేస్తానన్నది అత్తగారు. మౌనంగా ఊరుకున్న పద్మావతిని చూసి ఆవిడ కోపం నషాళానికెక్కింది.

"చెట్టంత మొగుడే పోయాక ఇంకా ఈ గాజులెందుకే నీకు? ఎవరికోసం ఈ షోకు'' అనకూడని మాటలు అత్తగారి నోటి వెంట వస్తూంటే వినలేక చెవులు మూసుకుంది పద్మావతి.

ఈమాత్రం కూడా అనుకోకపోతే ఇంక ఇక్కడ నువ్వుండాల్సిన అవసరం లేదు పొమ్మన్న అత్తగారికి జవాబుగా బిడ్డనెత్తుకుని పుట్టింటికి వచ్చేసింది పద్మావతి.

భర్తపోవడంతోటే జీవితేచ్ఛ నశించినా, ఎదిగే కొడుకు కోసం చనిపోవాలన్న కోరికని చంపుకుంది. ఏ పని చేయడానికీ ఆసక్తి లేకపోయినా బ్రతుకు తెరువుకోసం టైలరింగ్ నేర్చుకుని అదే జీవనాధారంగా మలచుకుంది. ఆమె జీవితంలో మరో పాతిక వసంతాలూ గ్రీష్మ ఋతువుల్లాగేనే గడిచిపోయాయి.

కొడుకు శివశంకర్ జీవితంలో స్థిరపడి ఓ ఇంటివాడయ్యాక తన బాధ్యత తీర్చుకున్న తృప్తితో పాటు తను కూడా భర్తని చేరుకోవాలనే ఆతృతా ఎక్కువైంది పద్మావతమ్మగా మారిన పద్మావతికి.

అందుకు సంకేతమేమో అన్నట్టుగా అనారోగ్యం కూడా ఆమె జీవితంలోకి ప్రవేశించింది.

★ ★ ★


ఆరోజు పద్మావతికి ఆయాసం ఎక్కువైంది. తెరలు తెరలుగా వస్తున్న దగ్గు ఊపిరి సలపనివ్వడంలేదు. లేని ఓపిక తెచ్చుకుని నెమ్మదిగా లేచి కూర్చుంది పద్మావతి. భర్త విశ్వనాథం ఎదురుగా వచ్చి పిలుస్తున్నట్లుగా అనిపించింది.

'వచ్చేస్తానండీ...ఇక మీ దగ్గరకి శాశ్వతంగా వచ్చేస్తాను. ఇంకా నేను చేయవలసిన పని ఒకటి మిగిలి ఉంది. అదొక్కటి పూర్తిచేసి ఇంక వచ్చేస్తాను' తనలో తనే గొణుక్కుంటున్నట్టుగా అంది పద్మావతి.

కొడుకూ కోడలూ ఇంట్లో లేరు. బయట తాళం వేసుకుని వెళ్ళారెక్కడికో. తల్లిని ఇంట్లో ఉంచి తాళం వేసుకుని వెళ్లడం వాళ్లకి అలవాటే.

పద్మావతమ్మ నెమ్మదిగా లేచి వంటింటివైపు నడిచింది. గ్యాస్‌స్టవ్ వెలిగించింది. చేతులనున్న గాజులు తీసి వెలిగే మంటలో వేసింది.

'ఇన్నాళ్ళూ ఈ గాజులతో తమ అవసరాలు తీర్చుకోవాలనుకున్న వాళ్ళు ఆ గాజుల మీద నాకున్న వ్యామోహం వల్లే నేను వాళ్లకి ఇవ్వడం లేదనుకునేవాళ్ళు. కానీ అవి పూతపూసిన బంగారు గాజులని తెలిస్తే వాళ్ళు మిమ్మల్ని హేళన చేస్తారు. మీ ప్రేమని చులకనచేస్తారు. ఎవరు నన్ను ఎన్ని మాటలన్నా నాకు బాధలేదు. కానీ మిమ్మల్ని ఎవరైనా తక్కువ చేసి మాట్లాడితే నేను సహించలేను. ఈక్షణమో మరుక్షణమో మీ దగ్గరికొచ్చేస్తున్న నాకు మీ పరువు దక్కడం కోసం మన ప్రేమ సాక్ష్యాన్ని కాల్చేయక తప్పడం లేదు. నన్ను క్షమిస్తారు కదూ...' నల్లగా కాలిపోయి, ఆకారం కోల్పోయిన గాజులని కిటికీలోంచి విసిరేసి అక్కడే కూలబడిపోయింది పద్మావతమ్మ. ★



## కొత్తరూపం

సల్మాన్‌ఖాన్ తీరే వేరు. ఆయన ఏం చేసినా అదీ వార్తాంశమే. ఇంతకీ అసలు కథ ఏంటంటారా? అక్కడికే వస్తున్నాం. రేవతి కొత్తచిత్రంలో ఆయన పాత్ర తీరుతెన్నుల గురించే అంతా అంటున్నారు. కొన్ని పాత్రలు చేయడానికి తారలు ఇమేజ్ గురించి ఆలోచిస్తారు. అయితే సల్మాన్ మాత్రం డేర్ అండ్ డేషింగ్‌గా ఈ సినిమాలో ఎయిడ్స్ రోగిగా నటించడానికి ఎలాంటి అభ్యంతరం చెప్పలేదు. 'ఇమేజ్ గురించి పట్టించుకుంటూ కూర్చుంటే ముందుకి సాగలేం. ఎయిడ్స్ రోగి పాత్ర నాకేం నష్టం కలుగజేయదు' అంటున్నాడు సల్మాన్.

